కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 55, బెండ 40, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్‌ 80, బీట్‌రూట్‌ 50, క్యాప్సికమ్‌ 70, క్యాబేజీ 25, క్యారెట్‌ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (2) 10, క్యాలీ ఫ్లవర్‌ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

ప్రారంభోత్సవం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని సీసీ రోడ్లు పనులు, ఉద్యానవనం ప్రారంభోత్సవం కార్యక్రమాలను గురువారం ఉదయం 9.30 గంటలకు పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించనున్నారు.

రాందేవ్‌రావ్‌ ఆసుపత్రిలో మార్చురీ యూనిట్‌ ప్రారంభం

కూకట్‌పల్లి: రాందేవ్‌రావ్‌ ఆసుపత్రిలో రోటరీ క్లబ్‌ ఆఫ్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్చురీ యూనిట్‌ను పీఏసీ చైర్మన్‌ గాంధీ, రాందేవ్‌రావ్‌ కుమారుడు విక్రమ్‌ దేవ్‌రావు, కార్పొరేటర్‌ నార్నె శ్రీనివాసరావు, రోటరీ క్లబ్‌ సభ్యులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంతో మార్చురీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్‌ ఆఫ్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ వారిని అభినందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ శరత్‌, చార్టర్‌ ప్రెసిడెంట్‌ కిలారు వేణుబాబు, ప్రెసిడెంట్‌ శ్రీనివాసరావు, సెక్రటరీ శివరామకృష్ణ, డైరెక్టర్‌ కమ్యూనిటీ సర్వీసెస్‌ విజయ్‌ భాస్కర్‌, డాక్టర్‌ యోబు, నాయకులు సంజీవరెడ్డి, ఎండీ ఇబ్రహీం, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

టీబీ లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి వైద్యులు శ్రవణ్‌చౌదరి, ఆసుపత్రి సిబ్బంది

కూకట్‌పల్లి: టీబీ ముక్తి భారత్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా బుధవారం జగద్గిరి గుట్టలోని యూపీహెచ్‌సీ ఆసుపత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులను ఏఐ ఎక్స్‌రే ద్వారా 175 మందిని స్క్రీనింగ్‌ చేశారు. ఈ సందర్భంగా మెడికల్‌ ఆఫీసర్‌ డా. ఎస్‌. శ్రవణ్‌చౌదరి మాట్లాడుతూ.. రెండు వారాల కంటే ఎక్కువ కాలం నిరంతరం దగ్గు, దగ్గినప్పుడు రక్తం, శ్లేష్మం రావడం, శ్వాస తీసుకున్నప్పుడు, దగ్గుతున్నప్పుడు ఛాతీ నొప్పి, బరువు తగ్గడం, అలసట, బలహీనత, సాయంత్రం వేళల్లో జ్వరం రావటం, రాత్రిపూట చమటలు రావటం, ఆకలి లేకపోవటం, శ్వాస ఆడకపోవటం ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ మోహన్‌, రామకృష్ణ, హాస్పిటల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

21న యోగా డే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్‌ గార్డెన్స్‌లో 21న నిర్వహించే యోగా డే వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కూకట్‌పల్లి స్వచ్ఛ అభియాన్‌ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మానసిక ప్రశాంతత, శారీరక పటుత్వం పెంచేందుకు యోగా దోహదపడుతుందని అన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌టవర్‌ను తొలగించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్‌ డివిజన్‌ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీ సీ పార్కులో ఏర్పాటు చేసిన సెల్‌ టవర్‌ను తొలగించాలని కాలనీవాసులు డిమాండ్‌ చేస్తున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి, కార్పొరేటర్‌ సింధురెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు కాలనీవాసులు తెలిపారు. కాలనీలో సెల్‌టవర్‌ హఠావో, సీ పార్కు బచావో అంటూ స్టికర్లు అంటిస్తున్నారు.

సీఎం సహాయనిధి వరం

రాజేంద్రనగర్‌: సీఎం సహాయనిధి నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. అనారోగ్య కారణాలతో మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి కింద రాజేంద్రనగర్‌ డివిజన్‌కు చెందిన పలువురికి మంజూరైన చెక్కులను ఆయన డివిజన్‌ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌ రెడ్డి, సీనియర్‌ నాయకుడు ప్రగడంపల్లి శ్రవణ్‌తో కలిసి బుధవారం తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నాయకులు పడమటి శ్రీధర్‌ రెడ్డి, ప్రభాకర్‌ రెడ్డి పాల్గొన్నారు.

నీటి వృథా !

జగద్గిరిగుట్ట: గోదావరి నీళ్లు వృథాగా పోతున్నాయి. గంటల తరబడి నీటి సరఫరా అవుతుండటంతో ఇళ్లలో ఉండే నీటి సంపులు నిండి రోడ్లపై పారుతున్నాయి. సంపులు నిండిన తర్వాత నల్లాకు వాల్వ్‌ బిగించుకోకపోవడమే కాకుండా అదే నీటితో వాహనాలు కడుక్కోవడంతో పాటు నీటిని రోడ్లపై వదులుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కాయిదమ్మకుంట చెరువు పక్కనే చెత్త డంపింగ్‌

బఫర్‌జోనే.. డంపింగ్‌యార్డు

జీహెచ్‌ఎంసీ చెత్త ఆటోల నుంచే డంపింగ్‌

కాయిదమ్మకుంట కలుషితమవుతున్నా పట్టించుకోని అధికారులు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు బఫర్‌జోన్‌లో చెత్తను డంప్‌ చేస్తున్నారు. దీంతో చెరువు కలుషితమవుతోంది. చందానగర్‌ సర్కిల్‌– 21 పరిధిలోని చెత్తను ఆటోల ద్వారా దీప్తిశ్రీ నగర్‌లోని డంపింగ్‌ యార్డుకు తరలించాల్సి ఉంది. కానీ చెత్తను తెచ్చి చెరువు పక్కన ఖాళీ స్థలంలో వేస్తున్నారు. ఇక చెత్తను వేరు చేసిన అనంతరం మిగిలిన వ్యర్థాలను కాయిదమ్మకుంట చెరువులో వేస్తున్నారు. చెత్త డంపింగ్‌ వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఇరిగేషన్‌, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్లాస్టిక్‌ వ్యర్థాలను తరలిస్తున్న వాహనం

- చెరువు పక్కనే స్క్రాప్‌ గోదాంను సైతం ఏర్పాటు చేశారు.
- చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి చెరువు పక్కనే వదిలేస్తున్నారు.
- ప్లాస్టిక్‌ వ్యర్థాలను శుభ్రం చేసిన తరువాత చెరువులో పడేస్తున్నారు.
- హోటళ్ళు, ఆసుపత్రి నుంచి తీసుకు వస్తున్న వ్యర్థాలు చెరువు పక్కనే వదిలేస్తున్నారు.
- చెత్తతో పరిసర ప్రాంతాలు దుర్గంధమయంగా మారాయి.

చెత్త డంపింగ్‌ గోదాంను తొలగిస్తాం..



కాయిదమ్మకుంట చెరువు సమీపంలో చెత్తను డంప్‌ చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. అక్రమంగా ఏర్పాటు చేసిన స్క్రాప్‌ గోదాంను వెంటనే తొలగించాలని నోటీసులు ఇచ్చాం. వారు తొలగించకపోతే త్వరలో మేమే తొలగిస్తాం. చెత్త ఆటోలు డంపింగ్‌ యార్డుకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్‌ రవికుమార్‌, ఏఎంహెచ్‌ఓ, చందానగర్‌ సర్కిల్‌– 21

తీవ్ర ఇబ్బందులు



కాయిదమ్మకుంట చెరువు బఫర్‌జోన్‌లో కొంతమంది చెత్తను డంప్‌ చేస్తున్నారు. వాసన భరించలేకపోతున్నాం. శానిటేషన్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఇప్పటికైనా చెత్త డంపింగ్‌ను అడ్డుకోవాలి. – కుమార్‌, హఫీజ్‌పేట్‌



- చెరువు పక్కనే వదిలేసిన వ్యర్థాలను పశువులు మేయడంతో అనారోగ్యంపాలవుతున్నాయి.
- ఇక ఇక్కడ అక్రమంగా బోరు వేసి భూగర్భ జలాలు తోడేస్తున్నారు.

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్‌ సమస్యకు చెక్‌

- పీఏసీ చైర్మన్‌ గాంధీ
- జోనల్‌ కమిషనర్‌, కార్పొరేటర్లతో కలిసి పర్యటన



అభివృద్ధి పనులపై సూచనలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌

ఆల్విన్‌కాలనీ: రోడ్డు విస్తరణతో ట్రాఫిక్‌ సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌, హైదర్‌నగర్‌ డివిజన్‌ల పరిధిలోని ఉషా ముళ్లపూడి కమాన్‌ నుంచి గాజుల రామారం వరకు ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ల రోడ్డు విస్తరణ, బాగ్‌ అమీర్‌ పెట్రోల్‌బంక్‌ నుంచి హైదర్‌నగర్‌ మహీంద్ర షోరూం వరకు జాతీయ రహదారి పక్కన సర్వీస్‌ రోడ్డు పునరుద్ధరణ, మిత్ర హిల్స్‌ నుంచి ఎన్‌టీఆర్‌ సర్కిల్‌ వరకు రోడ్డు విస్తరణ పనులు, లేక్‌ వ్యూ బార్‌ నుంచి నవోదయ కాలనీ మీదుగా ప్రేమ్‌ సరోవర్‌ వరకు నూతన రింగ్‌ రోడ్డు చేపట్టాలని జోనల్‌ కమిషనర్‌కు ఇటీవలే వినతిపత్రం అందజేశారు. బుధవారం జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌, కార్పొరేటర్‌లతో కలిసి పర్యటించారు. రోడ్డు విస్తరణ పనులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న కరెంట్‌ స్తంభాలను త్వరగా తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌, టౌన్‌ ప్లానింగ్‌ సిటీ ప్లానర్‌ గణపతి, ఇంజినీరింగ్‌ అధికారులు ఈఈ గోవర్ధన్‌, ఏఈ రాజీవ్‌, శ్రావణి, నిఖిల్‌, వర్క్స్‌ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్‌, రవికుమార్‌, గురువారెడ్డి, ఎలక్ట్రికల్‌ డిపార్టుమెంట్‌ అధికారులు డీఈ జనప్రియ, ఏఈ దయానంద్‌, ఏడీఈ లైన్స్‌ మధుకర్‌, ఏఈ కరుణ్‌కుమార్‌, వీధి లైట్లు డీఈ స్వప్న, ఏఎంఓహెచ్‌ శ్రీనివాస్‌, ఎస్‌ఆర్‌పీ నాయక్‌ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



నానక్‌రాంగూడ అంగన్‌వాడీ కేంద్రంలో..

రాయదుర్గం: నానక్‌రాంగూడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. డీడబ్ల్యూఓ శ్రీలత, సీడీపీఓ కవిత పిల్లల చేత అక్షరాలు దిద్దించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందించాలన్నారు. కేంద్రాలలో ప్రతి బుధవారం ఎగ్‌ బిర్యానీ ఇస్తున్నారన్నారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్‌ డే నిర్వహించారు. అంతకుముందు వారు మొక్కను నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిర, మాధురి, కోమలి, గాయత్రి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, నాగమణి, స్వప్న, జ్యోతి పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'ఫ్లాష్‌ ప్రొటెస్ట్‌'



పరిపాలనా భవనం ఎదుట నిరసన చేపట్టిన విద్యార్థి సంఘం

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో 'ఫ్లాష్‌ ప్రొటెస్ట్‌' పేరిట బుధవారం విద్యార్థులు నిరసన తెలిపారు. హెచ్‌సీయూ స్టూడెంట్స్‌ యూనియన్‌ 2024–25 ఆధ్వర్యంలో హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు 4 ప్రధాన డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేశారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఎస్టేట్‌ సెక్షన్‌ ఇన్‌చార్జిని తొలగించాలని, క్యాంపస్‌లో క్యాంటీన్లలో ధరలు అందుబాటులో ఉండేలా చూడాలని, అలాగే శుభ్రమైన వాతావరణంలో నిర్వహించాలని వారు డిమాండ్‌ చేశారు.

సందడిగా ముగ్గుల పోటీలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా సిబ్బందికి ముగ్గుల కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు మహిళా సిబ్బంది పాల్గొని రంగు రంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. ఉత్తమ ముగ్గులకు టౌన్‌ప్లానింగ్‌ అధికారి మణిహారిక ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి మహిళల పేర్లను నమోదు చేసుకున్నారు. ఎంపిక చేసిన మహిళలను సెప్టెంబర్‌ 10వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్వరూప, కవిత, జోష్న, సుష్మ, శిరీష, అనూష, రాణి, రాజశ్రీ, మీనాక్షమ్మ, మంజుల, రమాదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. కాపాడిన మియాపూర్‌ పోలీసులు

తల్లిదండ్రులకు అప్పగింత

మియాపూర్‌: అనారోగ్యం, మానసిక సమస్యతో బాధపడుతూ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన మహిళను మియాపూర్‌ పోలీసులు కాపాడారు. వివరాలిలా.. సికింద్రాబాద్‌కు చెందిన ఓ మహిళకు ముగ్గురు పిల్లలున్నారు. ఆమె జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంట్లో కేర్‌టేకర్‌గా పనిచేస్తోంది. కొంతకాలంగా తీవ్రమైన తలనొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఈ క్రమంలో ఆ మహిళ మియాపూర్‌లోని చర్చికి వచ్చింది. అనంతరం హఫీజ్‌పేట్‌ రైల్వే స్టేషన్‌ సమీపానికి వెళ్లి తమ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి మాట్లాడింది. ఓ సారి తమ పిల్లలను చూపించాలని తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వారికి ఫోన్‌లో చెప్పింది. కంగారు పడిన కుటుంబ సభ్యులు వెంటనే 100కు ఫోన్‌ చేయగా మియాపూర్‌ సీఐ క్రాంతి కుమార్‌కు సమాచారం అందించారు. మియాపూర్‌ పెట్రోల్‌ –1 మొబైల్‌ను తక్షణమే అప్రమత్తం చేయడంతో సిగ్నల్‌ ఆధారంగా రైల్వే ట్రాక్‌ వద్ద ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.వెంటనే అక్కడికి చేరుకుని ఆమెను పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మహిళ కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని అఘాయిత్యాలకు పాల్పడొద్దని సీఐ సూచించారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌లోని వెస్టర్న్‌ హిల్స్‌ సొసైటీ, అడ్డగుట్ట కాలనీ, సమతానగర్‌ కాలనీల్లో పార్కుల అభివృద్ధికి పీఏసీ చైర్మన్‌ గాంధీ గురువారం శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్‌ నార్నె శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వెస్టర్న్‌ హిల్స్‌ సొసైటీ అడ్డగుట్ట 9వ లైన్‌లో ఉన్న పార్కులో రూ.51.40 లక్షల అంచనా వ్యయంతో పార్కు అభివృద్ధి, ఓపెన్‌ జిమ్‌ పనులకు, ఉదయం 10:45 గంటలకు సమతానగర్‌ వార్డు కార్యాలయం ఎదురుగా ఉన్న చిన్న పార్కులో 68.60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

స్టేడియంలో ప్లాస్టిక్‌ వ్యర్థాల సేకరణ



గచ్చిబౌలి స్టేడియంలో ప్లాస్టిక్‌ వ్యర్థాలను సేకరించిన క్రీడాకారులు, తల్లిదండ్రులు

గచ్చిబౌలి: గచ్చిబౌలి స్టేడియం ప్రాంగణంలో ప్లాస్టిక్‌ ఫ్రీ నినాదంతో వ్యర్థాలను సేకరించారు. ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఇంటర్నేషనల్‌ ఒలింపిక్‌ డే రన్‌ నేపథ్యంలో మంగళవారం ప్లాస్టిక్‌ వ్యర్థాల సేకరణ చేపట్టినట్టు స్టేడియం ఏఓ మధు తెలిపారు. అంతర్గత రోడ్లు, ప్రాంగణంలో చెత్తను తొలగించామన్నారు. ప్లాస్టిక్‌ నియంత్రణ కోసం క్రీడాకారులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 23న ఉదయం 6 గంటలకు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే ఒలింపిక్‌ టార్చ్‌ ర్యాలీలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్‌–4లో ఉన్న పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి సహస్ర ఘటాభిషేకము, నవగ్రహ హోమం, మహా సుదర్శన హోమం, సాయంత్రం 6 గంటలకు కల్పవృక్ష వాహన సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు పూజలో పాల్గొన్నారు. భక్తులు హోమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

పటాన్‌చెరు టౌన్‌: మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి అన్నారు. బుధవారం అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పటేల్‌గూడ హరివిల్లు కాలనీలో హనుమాన్‌ ఆలయ ద్వితీయ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామి వారి పూజలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్‌ నాయకులు ఈర్ల శ్రీకాంత్‌, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌సీఐఐఎన్‌వి బయోసైన్సెస్‌, మైక్రోబిరాతో

ఎస్పైర్‌ బయోనెస్ట్‌ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న ఆయా సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: హెచ్‌సీయూలోని ఇంక్యుబేషన్‌ సెంటర్‌ ఎస్పైర్‌–బయోనెస్ట్‌ రెండు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఎస్పైర్‌ బయోనెస్ట్‌ ప్రాంగణంలో బయోటెక్‌ స్టార్టప్‌ ఎస్‌సీఐఐఎన్‌వి బయోసైన్సెస్‌, యూకే ఆధారిత బయోటెక్నాలజీ సంస్థ మైక్రోబిరా లిమిటెడ్‌ సంస్థతో భాగస్వామ్యం చేసుకుంది. ఆ హెచ్‌సీయూ విశ్రాంత సీనియర్‌ ప్రొఫెసర్‌ రెడ్డన్న మాట్లాడుతూ సకాలంలో వ్యాధికారకాలను గుర్తించడం ద్వారా అనుచితమైన యాంటీబయాటిక్‌ వాడకాన్ని అరికట్టడంలో ఈ చొరవ కీలకమైన అడుగుగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఏఎంఆర్‌ విధాన న్యాయవాది డాక్టర్‌ రంగారెడ్డి బుర్రి, డాక్టర్‌ రత్నాకలర్‌ పాలకోడేటి, ఎస్పైర్‌ బయోనెస్ట్‌ సీఈఓ డాక్టర్‌ అనిల్‌ కొండారెడ్డి, ఎస్‌సీఐఐఎన్‌వి బయోసైన్సెస్‌ చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ శ్రీకృష్ణ బుర్రి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి వినతి



రంగారెడ్డి జిల్లా డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మహేష్‌ యాదవ్‌ తదితరులు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధి మదీనాగూడ ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారనున్నాయని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్‌ యాదవ్‌ పేర్కొన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా డీఈఓకు మదీనాగూడ ప్రభుత్వ పాఠశాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షానికి పాఠశాలలోకి వరద నీరు చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌ యాదవ్‌ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ మేరకు ఓ సాఫ్ట్‌వేర్‌ సంస్థ పాఠశాలను అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపామన్నారు. అనంతరం పాఠశాల పునర్నిర్మాణం కోసం విద్యాశాఖ అధికారి పూర్ణచంద్రరావు చేతుల మీదుగా ఎన్‌ఓసీ పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణయ్య, సురేష్‌ కురుమ, సత్యనారాయణ, కుమార్‌, శివ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్‌

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్‌

గచ్చిబౌలి: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ సూచించారు. మసీదుబండ కొండాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో లింగంపల్లి డివిజన్‌ నూతన కార్యవర్గం ప్రకటించడంతోపాటు వికసిత్‌ భారత్‌ లక్ష్యంపై కార్యశాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బీజేపీ నాయకుడు డివిజన్లలోని అన్ని ప్రాంతాలలో పర్యటించి పార్టీని బలోపేతం చేయడంలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. యోగా దినోత్సవాన్ని ప్రతి డివిజన్‌, ప్రతి బూత్‌లో నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యలపై అధికార పార్టీని ఎప్పటికప్పుడు నిలదీస్తూ సమిష్టిగా పనిచేయాలన్నారు. డివిజన్‌కు సంబంధించి కమిటీలను, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలను నియమించాలన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి డివిజన్‌ సీనియర్‌ నాయకులు రామరాజు, కర్పర్ల ఎల్లేష్‌, మణిభూషణ్‌, భీమని కిషోర్‌ ముదిరాజ్‌, కౌసల్య, అరుణ్‌ యాదవ్‌, రాజేష్‌, శ్రీనివాస్‌, అఖిల్‌, సురేష్‌, స్వాతి, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి



సాయినగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్‌గౌడ్‌

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని సాయి నగర్‌ బస్తీ, గెజిటెడ్‌ ఆఫీసర్స్‌ కాలనీ, హేమదుర్గ టవర్స్‌, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌, డాల్ఫిన్‌ టవర్‌లలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్‌ పూజితతో కలిసి జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కౌన్సిల్‌ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్‌ బుధవారం పరిశీలించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చందానగర్‌ సర్కిల్‌ ఏఈ ప్రతాప్‌, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ ఎస్‌బి మేనేజర్‌ హరి, కాంగ్రెస్‌ నాయకులు యాదగిరి గౌడ్‌, నరేంద్రగౌడ్‌, సుదర్శన్‌, సంజు సాగర్‌, ముజీబ్‌, కామోజీ, లాలూ పటేల్‌, హమీద్‌, కాసిం, పాషా, మల్లేష్‌, సంతోష్‌, విల్సన్‌, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. దుర్వాసన



హెచ్‌డీఎఫ్‌సీ రోడ్డులో మురుగునీటి ప్రవాహం

మియాపూర్‌: మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డులో మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారు. గత పది రోజులుగా మురుగునీరు ప్రవహిస్తుండడంతో ఆ దారి వెంబడి వెళ్లే పాదచారులు, వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. వాహనాలు వెళ్లే సమయంలో మురుగునీరు పాదచారులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి వరదనీటి కాల్వ పనులు చేపట్టడంతో అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పైపులైన్‌ ధ్వంసమై మురుగునీరు పారుతోంది. ఈ మురుగునీరు మియాపూర్‌ నుండి బొల్లారం వెళ్లే ప్రధాన రహదారిపై కూడా నిల్వడంతో ఆ దారి వెంబడి వెళ్లే వందలాది వాహనదారులు అవస్థలుపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనుల్లో అలసత్వం

- ఆసుపత్రి, పాఠశాల నిర్మాణంలో ప్రభుత్వ జాప్యం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కేపీహెచ్‌బీ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీకాలనీ: బీఆర్‌ఎస్‌ పాలనలో హౌసింగ్‌ బోర్డు ఎంతో అభివృద్ధి చెందిందని, నేడు నిధుల లేమితో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావుతో కలిసి బుధవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ముందుగా 5వ ఫేజ్‌ వద్ద, మలేషియన్‌ టౌన్‌షిప్‌ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యను ప్రజలు వివరించారు. అనంతరం రెండేళ్ల క్రితం 100 పడకల ఆసుపత్రి కోసం శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. నిధులు మంజూరైనా కూడా కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే ఆసుపత్రి నిర్మించడంలో జాప్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం చేస్తున్న అలసత్వానికి ఉదాహరణే ఈ పాఠశాల నిర్మాణ జాప్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. హౌసింగ్‌ బోర్డు నుంచి ఎటువంటి అభ్యంతరం లేకపోయినా పనులు చేపట్టడానికి ప్రభుత్వం, కలెక్టర్‌ ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను పూర్తి చేయాలని కోరారు. అనంతరం వార్డు కార్యాలయంలో అసోసియేషన్‌ సభ్యులు, అధికారుల సమీక్ష సమావేశంలో అసోసియేషన్‌ సభ్యులు అందించిన వినతిపత్రాలను స్వీకరించారు. పార్కుల్లో ఓపెన్‌ జిమ్‌లు, చిన్న పిల్లలు ఆడుకునే పరికరాలను మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ కో ఆర్డినేటర్‌ సతీష్‌ అరోరా, డివిజన్‌ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజేష్‌, అన్ని విభాగాల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.